
# అమెరి'కులాసా' కథలు

## - వంగూరి చిట్టెన్ రాజు





## - 176 -

## పారేసుకోవిడ్-దాచేసుకోవిడ్ కథ

అమెరికాలో అత్యంత ఆనందకరమైన విశేషం....మా ఐ.ఆర్.ఎస్....నుంచి చెక్కు రావడం. మా కేంద్ర ప్రభుత్వం విచ్చలవిడిగా పెట్టే ఖర్చులూ, విదేశాలకి సహాయం పేరిట ఇచ్చే భారీ లంచాలూ, ఆయుధాల ఉచిత పంపిణీలూ వీటన్నిటికీ కావలసిన డబ్బు అంతా పన్నుల రూపంలో వసూలు చెయ్యడం ఈ ఐ ఆర్ ఎస్...అనగా ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ వాళ్ళ పని. మన మార్వాడీల కంటే అన్యాయంగా, క్రూరంగా పన్నులు వసూలు చేసే అలాంటి ఐ ఆర్ ఎస్ కి ఏడాది పొడుగునా టాక్స్ కడుతూనే ఉంటాం. నేను ఎందుకైనా మంచిది అని ఆ టాక్స్ కాస్త ఎక్కువగానే కడతాను కాబట్టి ఏడాది చివర్న టాక్స్ రిటర్న్ చేసినప్పుడు, ఏడాది పొడుగునా నేను అప్పటికే జమ చేసిన టాక్స్ ఆఖర్న లెక్క చూసినప్పుడు నిజంగా కట్టవలసిన టాక్స్ కంటే ఎక్కువగా ఉంటే "హమ్మయ్య" అనేసుకుంటాను. లేక నేనే ఆ దిక్కుమాలిన ఐ ఆర్ ఎస్ కి డబ్బు కట్టవలసి వస్తే క్రెడిట్ కార్డ్ మీద అప్పో సప్పో చేసో, కారు అమ్మి పారేసో వెంఠనే కట్టిపారేస్తాను. లేనిచో ఇద్దరం జైలుకి పోతామో ఏమిటో అని భయం. నాకైతే జైలు భయం కంటే అక్కడ నా సహ ఖైదీ క్వీన్ విక్టోరియాని ఊహించుకోడానికే ఎక్కువ భయంగా ఉంది.

ప్రతీ ఏడూ నేను ఎగస్ట్రాగా కట్టేసిన ఐదారు వందలో, వేలో డాలర్లు ఈ దౌర్భాగ్య ఐ ఆరె స్ వాళ్ళు మన డబ్బు తిరిగి మనకే ఇచ్చే రీఫండ్ అంటే నాకు భలే ముద్దు...ఈ ఆన్ లైన్ లూ, కంప్యూటర్ అమ్మాయిలూ రాక ముందు మాకు బాకీ ఉన్న ఆ డబ్బుని ఐఆరెస్ వాళ్ళు చెక్కు రూపంలో పంపించే వారు. అది ఎప్పుడు వస్తుందా, ముద్దెట్టుకుందాం అని నిద్రాహారాలు మనేసి పడిగాపులు పడి కూచునే రోజుల్లో ..అంటే పాతికేళ్ళ క్రితం మా క్వీన్ విక్టోరియాకి ఉన్న 'రోగం" బయట పడింది. దానికి ఇప్పుడూ నేను పెట్టుకున్న పేరు "పారేసుకోవిడ్". ఆ లక్షణాన్ని మరీ బొత్తిగా రోగం, వ్యసనం, జాడ్యం అనీ అనకూడదు కానీ అది మటుకు మహా చెడ్డ అలవాటు.

మా విషయం లో కూడా బెమ్మ దేవుడు తక్కువ తిన లేదు. ఎందుకంటే ఈ బెమ్మదేవుడు అనే వాడికి సొంత అనుభవం ఉందో లేదో తెలీదు కానీ, మొగుడూ, పెళ్ళాలకి భోగాల మాట దేవుడెరుగు...సరిగ్గా వ్యతిరేకంగా ఉండే రెండు

రోగాలు ఇస్తాడు. ఒక పెళ్ళానికి చిరంజీవి స్టెప్పులు ఇష్టమైతే సదరు మొగుడికి  బాలకృష్ణ గెంతులు బావుంటాయి. అంచేత ఆ హీరోలిద్దరూ బానే ఉంటారు వీళ్ళిద్దరూ కొట్టుకు చస్తూ ఉంటారు కదా!. ఒక మొగుడికి పిజ్జాలో హేలపీనో మిరపకాయలు ఇష్టం అయితే సదరు భార్యామణికి ఖచ్చితంగా ఉల్లిపాయలు కావాలి. అంచేత ఆ పిజ్జా మూడ్ లో ఉన్నప్పుడు సగం మిరపకాయలూ, ఇంకో సగం ఉల్లిపాయలతో కొనుక్కుని ఎవరి వాటా వాళ్ళు పంచుకుంటారు. పొరపాటున ఒక్క హెలపీనో పెప్పర్ ముక్క ఉల్లిపాయ వేపు వెళ్ళిందో..అంతే సంగతులు....కళ్ళమ్మట నీళ్ళే!. మా విషయం లో ఆ బెమ్మ దేవుడు రాసి పెట్టిన ఈ కోవిడ్ రోగాలు మరొక రకం. ఈ కాంబినేషన్ ప్రపంచంలో ఇంకెవరికీ ఆ బెమ్మ దేవుడు రాయ లేదు, రాయ లేదు అని  నా అనుమానం....అనుమానం ఏమిటీ,,,ఖచ్చితమైన నమ్మకమే...

ఆ రోజు నా జీవితంలో మర్చిపోలేని రోజు....

అసలు ఏం జరిగిందంటే.... పాతికేళ్ళ క్రితం ఒక ఏడాది నేను కష్టపడి మా జంట టాక్స్ రిటర్న్స్ చేసి అప్పుడు రావలసి ఐఆరెస్ వారి రిఫండ్ చెక్కు కోసం....అవును నిద్రాహారాలు మానేసి చంద్రుని కొసం చకోర పక్షి లాగా, పార్కులో తమన్నా బన్నీ కోసం ఎదురు చూసినట్టుగా చూసి, చూసి నెల్లాళ్ళు అయినా ఆ చెక్కు అందక పొయే సరికి నా కళ్ళుకాయలు కాచిపోయే పరిస్థితిలో ఉన్నాను. ఒక రోజు "మొగుడూ..ఇవాళ గార్బేజ్ వాళ్ళు వచ్చే రోజు. తెలుసుగా" అంది.  అమెరికాలో అందరి మొగుళ్ళ ప్రధాన కర్తవ్యాలలో ఒకటి అయిన 'గార్బేజ్ పైన పెట్టుట" అనే ఆమె కంఠ స్టోన్ ని బట్టి నేను కనిపెట్టి గంగిరెద్దు వలె తల ఊపి పెద్ద సైజులో కింద చక్రాలతో పెద్ద  ఉన్న సదరు ప్లాస్టిక్ గార్బేజ్ డబ్బాని కృష్ణుల వారు రాక్షస సంహారం కోసం రుబ్బురోలుని లాగుతున్నట్టు లాగుతూ ఉండగా....నాలో ఆరో శక్తి....సిక్స్త్ సెన్స్ అంటారే అదన మాట...అది బయటకు వచ్చింది. అంటే తల్లికి పిల్ల ఎక్కడుందో, ఆకలేస్తోందో ఎలా తెలిసిపోతాయో అలాంటి దివ్య శక్తి అనమాట నాది. ఆ  దివ్య వాణి ఆకాశవాణిలా  "అందులో చూడు" అని హెచ్చరించగానే నేను అనాలోచితంగానే టక్కున ఆగి, ఆ గార్బేజ్ డబ్బా మూత తీసి,ఆ దౌర్భాగ్యపు కువాసన ఆఘ్రాణిస్తూ, నన్ను నేను తిట్టుకుంటూ అందులో ఉన్న నానా చెత్తా చెదారాల కేసి ఏవగింపుగా చూడగా..పైన తేలియాడుతూ ఒకానొక కాగితం కవర్ కనపడింది...అది చూడగానే నా గుండె 'ఐఐఐ ఆర్ ఆర్ ఆర్ ఎస్ ఎస్ ఎస్" అని వేరే పద్ధతిలో కొట్టేసుకుంది...నేను రపీమని నా జన్మలో మొదటి సారిగా  ఆ గార్బేజ్ డబ్బాలోకి చొరబడి కాస్త తడి, తడిగా చావుబతుకుల్లో ఉన్న ఆ పోస్టల్ కవర్ ని జాగ్రత్తగా బయటకి లాగి అంత కంటే జాగ్రత్తగా చిటికెన వేలితో అది తెరవగానే .....అక్షరాలా ఐదువేల ఆరువందల డభై డాలర్ల ముప్పైమూడు సెంట్లు మా పవిత్ర భారత దంపతుల ఇద్దరి పేర్లమీదా ఒక చెక్కు...ఐ ఆర్ ఎస్ వాళ్ళ చెక్కు కనపడింది. దాని కోసమే కదా నేను చంద్రుడూ, చకోర పక్షీ, తమన్నా, బన్నీ ఆట ఆడుకుంటున్నదీ. అది అలవి కాని చోట అలా కనపడగానే అసలు ఈ ఐ అర్ ఎస్ వాళ్ళకి ఆ చెక్కు మా పోస్ట్ బాక్స్ బదులు గార్బేజ్ డబ్బాకి పంపించాలని ఎలా అనిపించిందో, వాళ్ళ రీఫండ్ చెక్కులు బట్వాడా చేసే పోలిసీ ఏమైనా మారిందా అని అనుమానం వచ్చింది. చెక్కు–

గార్బేజ్, గార్బేజ్–చెక్కూ ఇలా బుగ్గ మీద వేలెట్టుకుని ఆలోచించగా..చించగా...ఆ ఉపాసనకి క్వీన్ విక్టోరియా దేవి కళ్ళముందు కనపడింది. అప్పుడు నాకు రావి చెట్టు కింద బుద్ధుడిలాంటి ఫీలింగ్ వచ్చేసింది. జ్ఞానోదయం అయింది. మా క్వీన్ విక్టోరియాకి ఉన్న రోగ నిర్ధారణ జరిగింది. అప్పటికే నాకు చిన్న చిన్న అనుమానాలు ఉండనే ఉన్నాయి.

తరిగేసిన కూర తుక్కులతో పాటు ఆనపకాయ హోలు మొత్తం, బాగా వెతికితే కానీ కానీ కనపడని చిన్న సొట్ట ఉన్న లేనట్టున్న తళ తళ లాడుతున్న సారి కొత్త స్టీలు గిన్నె, వాల్మార్ట్ లో సేల్ ఉన్నాయిగా అని కొనుక్కున్న ఆరు చెడ్డీల పేకెట్టూ, డేటా అంతా ఉంటుంది కదా అని దాచుకున్న పాత సెల్ ఫోనూ, కడిగి తిరిగి వాడుకునే ప్లాస్టిక్ డబ్బాలతో సహా రెండే రెండు రోజుల నాటి లెఫ్ట్ ఓవర్ అన్నం, కూరలు, సాంబారు, నా కథల పుస్తకాలు, సగం వాడిన సబ్బు బిళ్ళ...ఇలా కాదేదీ గార్బేజ్ కి అనర్హం. ఏ వస్తువుకేనా గార్బేజ్ లోకి పారెయ్యడానికి ఉండవలసీన ఏకైక అర్హత ఆ రోజు క్వీన్ విక్టోరియా కంట పడడమే. అదీ పారేసుకోవిడ్ అవలక్షణాలు. మనం దానికి సరిగ్గా వ్యతిరేకం....ఆఖరికి మనసు పారెయ్యడం కూడా రాదు. అది నాగున్న దాచేసుకోవిడ్ అవలక్షణాలు..

ఆ నాడు ఐ ఆర్ ఎస్ చెక్కు ఎప్పుడైతే చెత్త డబ్బాలో చావుబతుకుల్లో కనపడిందో ...అప్పటి నుంచీ నేను ప్రతీ బుధవారం ఇంట్లో ఉండకుండా పారిపోతాను. ఎందుకంటే ఆ రోజు మా గార్బేజ్ పిక్ అప్ రోజు. అప్పుడు ఆవిడ కంటపడ్డానంటే అంతే సంగతులు. “ఇంత బతుకూ బతికి..అనే సామెత ఉంది కదా? అప్పుడు తెలియ లేదు కానీ ఇలా ప్రతీదీ చెత్త బుట్టలో పారెయ్యడం మూడు డోసులు వేక్సీనూ, ఒకటో రెండో బూస్టర్ షాట్లూ వేసుకున్నాక వచ్చే కోవిడ్ లాంటిదే. అంటే...ఏదో కాస్త చికాకు పెడుతుంది కానీ కాసిన్ని జాగ్రత్తలు తీసుకుంటే అదే పోతుంది. కానీ ఆవిడకి ఈ పారేసుకోవిడ్ లక్షణాలు రూఢి కాగానే చెప్పొద్దూ..నాలో ఉన్న “దాచేసుకోవిడ్” లక్షణాలు బయటకి వచ్చేశాయి. అంటే ఆ బెమ్మ దేవుడు ఆవిడకి అన్నీ పారేసే గుణం నుదిటి మీద రాసి పారేసినప్పుడే నా నుదిటి మీద కనపడినదల్లా దాచెయ్ రా అబ్బాయ్ అని చెక్కి పారేశాడు. మా పరస్పర రోగ నిర్ధారణలూ అవగానే నాకొచ్చిన ప్రశ్న...విత్తు ముందా. చెట్టు ముందా, కోడి ముందా, గుడ్డు ముందా, గార్బేజ్ లోకి పారేసే ముందు అన్నీ దాచడమా లేక ఆవిడ పారేశాక ఇందాకా చెక్కు లాగా అందులో దొరికినవన్నీ దాచుకోవడమా? ఇదేదో తేలే లోగా నేను ఎందుకైనా మంచిది అని మా రెండు గార్బేజ్ డబ్బాలకీ ..ఒకటి మామూలు చెత్తది, మరొకటి రీసైకిల్ చెత్తది...వాటి మూతలు తెరుచుకోకుండా తాళ్ళు వేసి కట్టేసి తాళం వేసి ఆ తాళం చెవి ఆవిడ మంగళ సూత్రాలు దాచుకునే బేంక్ లాకర్ లో ఆవిడకి తెలియకుండా పెట్టేశాను. ప్రతీ బుధవారం వెళ్ళి ఆ తాళం తెచ్చి నా సమక్షం లో ఆ గార్బేజ్ లోకి ఆవిడ ఏమేమి వస్తువులు విసిరేస్తుందో దగ్గరుండి చూసుకుందాం అని నాలో ఉన్న దాచేసుకోవిడ్ గాడి ఆలోచన. అవిడియా అద్భుతంగా ఉంది కదా అని ఆచరణలో పెట్టగానే చిన్న ఇబ్బంది మొదలయింది. ప్రతీ రోజూ మా ఇల్లు వెనకాల అరుగు కాకీనాడ గాంధీ నగరంలో మా ఇంటి ముందు మ్యునిసిపాలిటీ వాళ్ళ చెత్త కుండీ గుర్తుకు రావడం మొదలెట్టింది. మా పక్కింటి దొరా, దొరసానీ గుడ్డ ముక్కలతో చేసిన మాస్క్ లు

కాకుండా ఏకంగా స్టైన్ లెస్ స్టీల్ మాస్క్ లు పెట్టుకుని మా ఇంటి కేసి అదోలా చూడడం, పోలీసులు రౌండ్లు వెయ్యడం మొదలయింది. అనగా....రోజు వారీ వంటా, పెంటా చెత్త చెదారం తాళం వేసి ఉన్న గార్బేజ్ డబ్బాలో వేసే అవకాశం లేక మా క్వీన్ విక్టోరియా దర్జాగా ఆ డబ్బా చుట్టూ సిమెంట్ చపటా మీదే చెత్త చెదారం అంతా విసిరెయ్యడం మొదలెట్టింది. అంటే. పారేసుకోవిడ్ మరొక పైత్య లక్షణం అయిన 'మొగుడి మీద కసి' తీర్చుకొనుట అనమాట. దీంతో నేను ఈ తాళం వేయుట పద్ధతికి స్వస్తి చెప్పి, నన్ను జైలుకి పంపించే అవకాశం మా పక్కింటి వాళ్ళకి ఇవ్వకుండా చాకచక్యంగా వ్యవహరించాను. ఏతావాతా చెప్పేదేమిటంటే ఇక నుంచీ ఎవరైనా బుధ వారం మా ఇంటికి వస్తే నేను చాలా బిజీగా ఉంటాను. రెండు 60 గేలన్ల సైజు ఉండే పెద్ద గార్బేజ్ డబ్బాలలో ఆకలిరాజ్యం లో కమలా హాసన్ టైపులో "ప్రజాస్వామ్యం పడిపోయిందేమో" అని వెతుక్కుంటూ ఉంటాను. క్వీన్ విక్టోరియా పారేసుకోవిడ్ కీ నా దాచేసుకోవిడ్ కీ అసలు కారణం ఆ చైనా వాడే అయ్యుంటాడు! ఏమంటారు?

**COMMENTS**